

హెచ్ఎంల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

హెచ్ఎంలు తగిన కృషి చేయాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలో సమీక్ష సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతుల ద్వారా నాణ్యమైన విద్యను అందించినప్పుడే ఫలితాలు సాధ్యపడుతాయన్నారు. 2022-23లో పదో తరగతి పరీక్షలో జిల్లాలో 92 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది వంద శాతం ఫలితాలు లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో వరంగల్, ఖిలా వరంగల్, గీసుగొండ, నర్సంపేట తక్కువ ఉత్తీర్ణత సాధించాయని ఆయా ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులతో మమేకమై ఉత్తమ విద్యాబోధన నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక టెస్టులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. విద్యార్థులకు అల్పాహారం అందించాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా వీర్‌గాథ విజేత కీర్తి ప్రసన్నను కలెక్టర్ సన్మానించారు. ఉప్పరపెల్లి గ్రామ ఖ్యాతిని ఢిల్లీకి తీసుకెళ్లిన ఆయన్ను తోటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఎంఈవోలు సత్యనారాయణ, రంగయ్య, విజయ్‌కుమార్, రత్నమాల, డీఎస్‌వో శ్రీనివాస్, సారయ్య, సుధీర్‌బాబు, డాక్టర్ కట్ల శ్రీనివాస్, పిన్నింటి బాలాజీరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తొద్దు..

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తొద్దని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ హన్మంతరావుతో కలిసి ములుగు జిల్లా నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిన సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల7 నుంచి 17 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, మిషన్ భగీరథ ఎస్‌ఈ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

- మంత్రులు జూపల్లి, పొంగులేటితో చర్చలు
- వరంగల్ ఎంపీ టికెట్‌పై హామీ ఇచ్చినట్లుగా ప్రచారం
- త్వరలో కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం
- మరో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పక్కచూపులు
- ఎంపీ టికెట్ హామీతో బీజేపీ నేతల మంతనాలు
- నర్సంపేట బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీజేపీలో చేరిక
- లోక్‌సభ ఎన్నికల వేళ గులాబీ పార్టీకి భారీ ఝలక్





'కారు'లో కుదుపు

బీఆర్ఎస్‌కు మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య రాజీనామా

వరంగల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికల వేళ.. బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవటంతో పాటు వరంగల్ ఎంపీ సీటుపై అధిష్ఠానం తిరకాసు పెడుతుండటంతో అగ్రహంతో ఉన్న రాజయ్య.. శనివారం పార్టీకి రాజీనామా ప్రకటించారు. నాలుగైదు రోజులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో రాజయ్య సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. తాటికొండ చేరికకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటంతో శనివారం గులాబీకి గుడ్‌బై చెప్పారు. కాగా, నర్సంపేట బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఐదు గురు కమలం గూటిలోకి చేరేందుకు రెడీ అవుతుండగా, మరో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పక్క చూపులు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో గులాబీ పార్టీలో గుబులు రేగుతోంది.

కారు దిగిన తాటికొండ

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈమేరకు బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు శనివారం తన రాజీనామా లేఖ పంపించారు. 1997లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి రాజయ్య.. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కడియం శ్రీహరి చేతిలో ఓటమిపాలయ్యాడు. 2004 మహాకూటమి పొత్తులో భాగంగా రాజయ్యకు టికెట్ దక్కలేదు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఓటమి పాలయ్యాడు. అయితే 2009లో జరిగిన ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా తొలిసారిగా విజయం సాధించారు. ఆ తరువాత తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న రాజయ్య.. 2011 అక్టోబరు 30వ తేదీన బీఆర్ఎస్‌లో చేరారు. అదే రోజు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేరారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో రాజయ్య రెండోసారి బీఆర్ఎస్ నుంచి పోటీచేసి టీడీపీ అభ్యర్థి కడియం శ్రీహరిపై 48,641 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే గెలిచిన రాజయ్యకు 2014లో బీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అయితే కొన్ని కారణాలతో రెండేళ్లకే రాజయ్య పదవిని కోల్పోవాల్సి వచ్చింది. అయినప్పటికీ గులాబీ పార్టీలోనే కొనసాగుతూ వస్తు న్న రాజయ్యకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ నిరాకరించింది. ఎన్నికల ముందు కూడా రాజ య్య చుట్టూ వివాదాలు చక్కర్లు కొట్టాయి. దీనికితోడు కడియం శ్రీహరితో ఉన్న విభేదాలను మీడియాతో పంచుకోవటంతో రాజయ్యపై అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్ఠానం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థిగా నిలబెట్టింది. రాజయ్యకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ టికెట్‌పై హామీతోపాటు రైతు సమన్వయ సమితి (రైతుబంధు) రాష్ట్ర చైర్మన్‌గా నియమించారు. అయితే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోవటంతో పాటు బీఆర్ఎస్ తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే అవకాశాలు లేకపోవటంతో రాజయ్య కారు దిగినట్లుగా ప్రచారం జరుగుతోంది.

గులాబీపై గుస్సా

గులాబీ పార్టీపై రాజయ్య కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇస్తామని గులాబీ అధిష్ఠానం ఇచ్చిన హామీ కూడా నెరవేరే పరిస్థితి కనిపించటం లేదు.అంతేకాక స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యకు వరంగల్ ఎంపీ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికితోడు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సైతం వరంగల్ ఎంపీ టికెట్ కోసం గులాబీ అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకవస్తున్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న రాజయ్య.. తన రాజకీయ భవిష్యత్తు కోసం పాత పార్టీ వైపు మొగ్గు చూపారనే టాక్ వినబడుతోంది.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులను కలిసినట్లుగా సమాచారం. వారి నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధమైనట్లుగా సమాచారం. కాగా, ఇప్పటికే వరంగల్ ఎంపీ సీటు కోసం కాంగ్రెస్ సీనియర్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి సైతం టికెట్ కోసం ఏకంగా సోనియాగాంధీనే కలిసి వచ్చారు. ఈ క్రమంలో రాజయ్యకు వరంగల్ ఎంపీ టికెట్‌పై హామీ ఇచ్చారా? లేక రాజకీయ భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ నుంచి బయటకు రావాలని నిర్ణయం తీసుకున్నారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ టచ్‌లోకి మాజీ ఎమ్మెల్యే..?

తాటికొండ రాజయ్య ఎపిసోడ్ ఓరుగల్లు రాజకీయాల్లో హాట్‌హాట్‌గా మారుతున్న వేళ.. మరో మాజీ ఎమ్మెల్యే కూడా గులాబీ పార్టీ ఝలక్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన ఓ నేత వరంగల్ ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెను ఎంపీ బరిలో దింపేందుకు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్న క్రమంలో సదరు మాజీ ఎమ్మెల్యేకు బీజేపీ నేతలు టచ్‌లోకి వచ్చినట్లుగా సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గాలి వీచే అవకాశం ఉండటంతో బలమైన అభ్యర్థిని బరిలో దించాలని కమలం పార్టీ వ్యూహం రచిస్తోంది. టికెట్‌తో పాటు ఎన్నికల్లో ఖర్చులో కొంత భరించేందుకు సిద్ధమని కూడా కాషాయ పార్టీ నుంచి హామీ లభించినట్లుగా తెలిసింది. దీంతో ఆ గులాబీ మాజీ ఎమ్మెల్యే ఆలోచనలో పడ్డట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న గులాబీ పెద్దలు.. ఆ మాజీ ఎమ్మెల్యేతో చర్చలు జరుపుతున్నట్లుగా తెలిసింది. ఒక వేళ చర్చలు విఫలమైతే కారు పార్టీలో మరో భా రీ కుదుపు తప్పదనే చర్చ జరుగుతోంది. అలాగే నర్సంపేట నియోజకవర్గానికి చెందిన ప్రతాప్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ప్రతాప్‌రెడ్డితోపాటు నర్సంపేట పట్టణానికి చెందిన ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం ఆ పార్టీకి ఝలక్ ఇచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే భూపాలపల్లికి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో వరుసగా బీఆర్ఎస్‌కు వలసలతో నేతలు షాకులు ఇస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

తమ్ముడిని హత్య చేసిన అన్న

8

- ఇంటి స్థలం, కుటుంబ కలహాలతో తరచూ గొడవలు
- మద్యం మత్తులో తమ్ముడి ఘర్షణ
- కత్తితో అన్న గొంతు కోయడంతో మృతి
- నందిగామలో శనివారం రాత్రి ఘటన



కుమారస్వామి (ఫైల్)

స్మార్ట్‌సిటీ 2.0 చాలెంజ్‌కు నగరం

- ఫైనల్స్‌కు ఎంపికైతే నగరానికి రూ.135కోట్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 3: స్మార్ట్‌సిటీ 2.0 చాలెంజ్‌కు వరంగల్ మహానగరం ఎంపికైంది. సిటీ ఇన్వెస్ట్‌మెంట్ టూ ఇన్నోవేటివ్ (సీఐటీఐఐఎస్ 2.0) చాలెంజ్‌ను కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో స్మార్ట్‌సిటీ నగరాల ఎంపిక చాలెంజ్ నిర్వహించనున్నారు. ఈ నెల 8న ఢిల్లీలో ఈ మేరకు ప్రజంటేషన్ కార్యక్రమం జరుగనుంది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన అభివృద్ధి, నగర రూపురేఖలపై సంపూర్ణ డాక్యుమెంటేషన్‌ను దేశంలోని 84 నగరాలు తొలిదశలో సమర్పించాయి. వీటి నుంచి నగరాలను ఎంపిక చేసిన క్రమంలో నగరానికి చోటు దక్కింది. ఈ నెల 8న ఢిల్లీలో జరిగే ప్రజంటేషన్ కార్యక్రమంలో ఫైనల్స్‌లో రెండు సెషన్లు ఉంటాయి. తొలి సెషన్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ జ్యూరీ ఎదుట స్మార్ట్‌సిటీ కింద నగరంలో చేపట్టిన 13 ప్రధాన అభివృద్ధి పనులను తొలి దశలో 13 నిమిషాల వ్యవధిలో ప్రాజెక్ట్ చేస్తారు. ఆ తదుపరి రెండో సెషన్‌లో 15 నిమిషాల వ్యవధిలో జ్యూరీ సమీక్షంలో స్లైడ్‌లను ప్రదర్శిస్తూ వివరిస్తారు. ఇందులో మొత్తం 18నగరాల ఎంపిక మాత్రమే జరుగుతుంది. ఈఎంపికలో నగరానికి చోటు దక్కితే రూ.135 కోట్లను కేంద్ర మంత్రిత్వ శాఖ జీడబ్ల్యూఎంసీకి కేటాయిస్తుంది. ఈ నిధులు నగరాభివృద్ధికి దోహదపడతాయి. కాగా, స్మార్ట్‌సిటీ చాలెంజ్‌కు వరంగల్ నగరం ఎంపికవ్వడం అభినందనీయమని మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు.

నగరాభివృద్ధికి అంకితభావంతో పని చేయండి

- సమీక్షలో అధికారులతో మంత్రి కొండా సురేఖ



కుడా కార్యాలయంలో జరిగిన నగరాభివృద్ధి సమీక్షలో మంత్రి కొండా సురేఖ

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 3: వరంగల్ నగరాభివృద్ధికి అంకితభావంతో పని చేసి క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. శనివారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ, కుడా, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖలతో నగరాభివృద్ధిపై ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో కలిసి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10కోట్లు కేటాయించిందని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రాధాన్య క్రమంలో పనులను ప్రతిపాదించాలని సూచించారు. స్టేడియాల నిర్మాణం, వరంగల్ ఉర్సు రంగ సముద్రం బండ్ అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చర్యలను వేగవంతం చేయాలన్నారు. స్మార్ట్‌సిటీ పనులను త్వరగా ముగించాలన్నారు. నగరంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.250కోట్లతో నాలాల విస్తరణ, రిటెయినింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. నయీంనగర్ నాలా రిటెయినింగ్ పనులను సమీక్షించారు. వరంగల్ బస్ టెర్మినల్ రూ.75 కోట్లతో నిర్మించనున్న క్రమంలో త్వరగా ప్రారంభించాలన్నారు. భద్రకాళి మాడ వీధుల నిర్మాణ చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని చెరువులు, కుంటల పరిరక్షణ జరగాలన్నారు.

తాగునీటి సమస్య తలెత్తొద్దు..

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని జీడబ్ల్యూఎంసీ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. ప్రతీ డివిజన్‌లో ఇంటింటికి నీరు సరఫరా కావాలన్నారు. టెయిల్ ఎండ్ ప్రాంతాలకు సైతం నీటి సరఫరా జరగాలని స్పష్టం చేశారు. ప్రతి డివిజన్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరాన్ని టూరిజం, సెంట్రల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామని వివరించారు. బల్దియా పారిశుధ్య కార్మికులు ప్రజాప్రతినిధుల పనోళ్లు కారనేది గుర్తించాలని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. కొందరు కార్పొరేటర్లు కార్మికులతో ఇంటి, సొంత పనులు చేయించుకోవడం దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఇకపై ఇలా జరిగితే సహించేది లేదని, బల్దియా అధికారులనే బాధ్యులవుతారని హెచ్చరించారు.

విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి..

విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు బల్దియా అధికారులకు సూచించారు. మౌలిక సదుపాయాల కొరత, పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

మాడ వీధులను వెంటనే ప్రారంభించాలి

భద్రకాళి మాడ విధుల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రం పనులను ముగించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమీక్షలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ, రాధిక గుప్తా, ఆర్‌డీవో రమేశ్, వాసుచంద్రతో పాటు బల్దియా, కుడా అధికారులు పాల్గొన్నారు.

కబ్జాలు, దోపిడీపై బీఆర్ఎస్ దృష్టి

- నిధుల వినియోగంలో గత ప్రభుత్వం విఫలం
- నరేందర్ రూ.3కోట్ల సీడీఎఫ్ ముట్టనే లేదు..
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

7

సీఐల బదిలీలకు రంగం సిద్ధం

- కమిషనరేట్ పరిధిలో భారీగా జరగనున్న బదిలీలు
- సిఫారసు లెటర్ పొందిన వారికే పోస్టింగ్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 3: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో పోలీసు అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి కమిషనరేట్ పరిధిలో పెద్దగా బదిలీలు జరగలేదు. ఒక్క ఇంతెజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ తప్ప.. ఎక్కడా బదిలీలు, పోస్టింగ్‌లు జరుగలేదు. ఇప్పటివరకు పనిచేస్తున్న అధికారులంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోస్టింగ్‌లు పొందిన వారే. కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సీఐల బదిలీలు, పోస్టింగ్‌లు చేస్తున్నట్లు తెలిసింది.

20 ఠాణాల్లో..

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని 45 లాఅండ్‌ఆర్డర్, 3 ట్రాఫిక్, 2 మహిళా పీఎస్‌లు, 1 షీటీమ్, 1 భరోసా ఠాణాలతో పాటు టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక విభాగం ఉంది. ఈ మేరకు మొదటి విడతగా 20 పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్‌హెచ్‌వోలను బదిలీ చేసేందుకు పోలీసు శాఖ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అదే విధంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న 13 మందికి కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు పోస్టింగ్ లెటర్స్ రెడీ చేసినట్టు తెలిసింది. సోమవారం సీఐల పోస్టింగ్‌ల ఆర్డర్లు బయటకు వచ్చే అవకాశాలున్నాయి. కొందరి బదిలీలను సీపీ అంబర్ కిశోర్ ఝా చేస్తుండగా, మరికొందరి బదిలీలు, పోస్టింగ్‌లు మల్టీజోన్ ఐజీ కార్యాలయం నుంచి జరిగే అవకాశాలున్నాయి.

మళ్లీ పాత పద్ధతేనా?

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరగబోయే పోలీసు పోస్టింగ్‌లలో మళ్లీ పాత పద్ధతి (సిఫారసు లెటర్)నే అవలంబిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. గత ప్రభుత్వంలో పోస్టింగ్ పొందాలంటే స్థానిక ఎమ్మెల్యే లెటర్ ఇస్తే సరిపోయేది. కానీ ప్రభుత్వం మారడంతో కొత్త పద్ధతులు పుట్టుకొచ్చాయి. ఇప్పుడు సీఐగా పోస్టింగ్ పొందాలంటే ముందుగా ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకోవాలి. ఆపై ఆ లెటర్ స్థానిక మంత్రికి పంపిస్తే.. మంత్రి ఖరారు చేసి సీపీకి పంపిస్తారు. అప్పుడే ఆ అధికారికి పోస్టింగ్ వస్తుందనే ప్రచారం జరుగుతోంది.

వివాదాస్పద అధికారుల యత్నాలు

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆరేళ్లుగా పలు పోలీసు స్టేషన్‌లలో సీఐలుగా పనిచేసి భూవివాదాలు, బెదిరింపులు, దాడులు, అవినీతికి పాల్పడి సస్పెన్షన్‌కు గురైన సీఐలు.. మళ్లీ పోస్టింగ్‌లు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, గాడ్‌ఫాదర్లను ప్రసన్నం చేసుకుంటున్నారని సమాచారం. తాము ఎంతైనా ఇస్తామని, కానీ కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వాలన్న షరతుతో మధ్యవర్తులతో బేరసారాలు ఆడుతున్నట్లు సమాచారం. ఇలా.. సుమారు పది మంది కరప్షన్ కింగ్‌లు కమిషనరేట్‌కు నేడో రేపో రానున్నట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యేలు, మంత్రులు, సీపీ స్పందించి.. సిఫారసు ద్వారా కాకుండా సర్వీస్ బుక్ ఆధారంగా నిజాయితీపరులైన అధికారులను ఇన్‌స్పెక్టర్లుగా ఠాణాలకు నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

'కాషాయ' తీర్థం పుచ్చుకున్న ఐదుగురు కౌన్సిలర్లు



నర్సంపేట నాయకులకు బీజేపీ కండువాను కప్పుతున్న కిషన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 3 : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డితోపాటు ఐదుగురు కౌన్సిలర్లతో సహా 55 మంది కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో శనివారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి 13మంది కౌన్సిలర్లు రాజీనామా చేసిన విషయం విదితమే. వీరంతా హైదరాబాద్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు శీలం రాంబాబు, జుర్రరాజు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, నూనావత్ కవితవీరన్న, దుగ్గొండి మండలం మహ్మదాపురం సొసైటీ వైస్ చైర్మన్ పాలడుగుల జీవన్‌తో సహా 55మందికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఈటల రాజేందర్ సైతం వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, యువ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రాంచందర్ రెడ్డి, కోమాండ్ల సప్తగిరి, వనపర్తి మల్లయ్య పాల్గొన్నారు.

మారిన రాజకీయాలు

నర్సంపేట మునిసిపల్ చైర్ పర్సన్ గుంటి రజనిపై గతనెల 2న 13 మంది కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని అందజేయగా ఇదేనెల 30న స్థానిక మునిసిపాలిటీలో ప్రత్యేక అధికారి ఆర్డీవో కృష్ణవేణి, కమిషనర్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అవిశ్వాసం వీగిపోవడంతో భంగపాటుకు గురైన 13 మంది కౌన్సిలర్లు సర్వాపురంలో జరిపిన సమావేశంలో 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకట్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఈ13 మందిలో శనివారం పైన పేర్కొన్న ఐదుగురు కౌన్సిలర్లు బీజేపీ రారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన నాటి నుంచే రాజకీయ పర్వం ఆరంభమై బీఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకొని ఉత్కంఠతకు దారి తీశాయి.

8 మంది కౌన్సిలర్ల రూట్ ఎటో..

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో ఐదుగురు బీజేపీలో చేరగా, మిగిలిన 8 మంది ఏ పార్టీలో చేరకుండా ఉంటారా? లేక వీరు కూడా బీజేపీలో చేరుతారా, మనసు మార్చుకొని తిరిగి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతారా అన్న ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కౌన్సిలర్లు గత రెండు మూడు రోజులుగా తర్జనభర్జన పడుతున్నారు. వీరిలో ఒకరిద్దరు బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీకి దూరమైన కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నేత అంగీకరించే అవకాశాలు లేవు. బీజేపీ తప్ప ఇతర పార్టీల్లో చేరే అవకాశాలు వారికి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈ 8 మంది ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నారు. 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇప్పటి వరకు వారి నిర్ణయంపై పెదవి విప్పలేదు.

బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ

నర్సంపేట బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే తాజాగా బీఆర్ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో 5గురు కౌన్సిలర్లతో సహా 55 మంది తాజాగా శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న బీజేపీలో చేరడం బీఆర్ఎస్ పార్టీకి గట్టిదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్టీసీ కారుణ్య నియామకాలకు మోక్షం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ● లహరి ఏసీ సెమీ స్లీపర్ బస్సులకు ప్రారంభం



కారుణ్య నియామక పత్రం అందుకుంటూ విలపిస్తున్న స్వప్న

సుబేదారి, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం వల్లే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కలిగిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హనుమకొండలో బస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం 70 మందికి కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగాల నియామకపత్రాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యేలు, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మరికొన్ని రోజుల్లోనే మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. 6 గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం నియామకాలను నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే 7వేల స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మరికొన్ని రోజుల్లోనే 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సీపీ అంబర్ కిశోర్ ఝా, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ ఆర్ఎంలు కే.భానుకిరణ్, మాధవరావుతోపాటు డిపోల మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభించిన మంత్రి

వరంగల్-1 డిపోకే కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను వరంగల్-1 డిపో నుంచి బెంగళూరుకు నడపనున్నారు. ప్రయాణికులు ఈ బస్సులను వినియగించుకుని సౌకర్యంగా ప్రయాణం చేయాలన్నారు.

10లోగా మేడారం ఏర్పాట్లు పూర్తి

భక్తులకు అందుబాటులోకి సదుపాయాలు : కాంట్రాక్టర్‌లకు రాష్ట్ర మంత్రి సీతక్క సూచన



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 3: మేడారం మహాజాతర ఏర్పాట్లను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలం మేడారంలో పర్యటించిన మంత్రి పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందుబాటులోకి వచ్చిన సదుపాయాలు, పూర్తికాని పనులపై చర్చించారు. శాఖల వారీగా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందించడం కోసం ప్రభుత్వం రూ.105 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా జాతర పనులను అలస్యంగా చేపట్టడం జరిగిందన్నారు. అయినప్పటికీ జాతరకు పది రోజుల ముందే సౌకర్యాలను వినియోగంలోకి తీసుకువస్తామని మంత్రి సీతక్క చెప్పారు. కొన్ని మట్టి రోడ్డు పనులు మిగిలి ఉన్నాయని, ఊరట్టం-కొండాయి రోడ్డు పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయని తెలిపారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడటం జరిగిందని, రోడ్డు పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని కొందరు కాంట్రాక్టర్లు జాతర పనులలో మొండికేసే ప్రయత్నం చేశారని, వారిని తప్పించి మరో కాంట్రాక్టర్‌తో పనులు చేయించామని తెలిపారు. పాత బిల్లులతో మేడారం పనులకు ముడిపెడితే ఊరుకునేది లేదన్నారు.

ప్లాస్టిక్ రహితంగా జాతర

ప్లాస్టిక్ రహితంగా జాతర నిర్వహించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణ నియమాలను పాటించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీలో పాల్గొన్నారు. చీపురుతో గద్దెల ప్రధాన ద్వారం ఎదుట రోడ్లను ఊడ్చారు.

ఓర్వలేకనే ఆరోపణలు

ఎంఎస్ఎంఈ స్కీం కింద రెండు మహిళా సంఘాలకు ఫుడ్ ట్రక్కులను పంపిణీ చేశారు. ఏటూరునాగారం మండలం ఎక్కెల గ్రామంలో సమ్మక్క, సారలమ్మ మహిళా గ్రూపు, గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన రాజరాజేశ్వర మహిళా సంఘానికి ఈ ట్రక్కులను జేడీఎం కొండల్‌రావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోరుతుందని, అందులో భాగంగానే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఓర్చుకోలేక కూలిపోతుందని తప్పుడు మాటలు మాట్లాడుతున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. టీఆర్ఎస్ పేరుతో ప్రజల్లోకి వచ్చిన కేసీఆర్ అధికార అహంకారంతో దేశ రాజకీయాలు చేస్తానని బీఆర్ఎస్‌గా పార్టీ పేరును మార్చడంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. ప్రియాంక గాంధీకి తెలంగాణలో తిరిగే అర్హత లేదని కేసీఆర్ బిడ్డ కవిత అనడం సరి కాదని అన్నారు. రాష్ట్రంలో ఏ మహిళను తిరగనివ్వకుండా కేసీఆర్ బిడ్డ ఒక్కతే తిరుగుతుందా..! అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించలేని దుస్థితి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఏపీవో వసంతరావు, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో చీపురుతో ఊడుస్తుతున్న మంత్రి సీతక్క

కబ్జాలు, అక్రమాలు, దోపిడీపై బీఆర్ఎస్ దృష్టి

నిధుల వినియోగంలో గత ప్రభుత్వం విఫలం ● తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తాం.. ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: వరంగల్ నగరాభివృద్ధికి వివిధ విభాగాల ద్వారా మంజూరైన నిధులను కూడా వినియోగించలేని దుస్థితిలో గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాలన చేశారని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. శనివారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ, కుడా పనులను సమీక్షించారు. అనంతరం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ తదితర విభాగాల నిధులను నగరాభివృద్ధికి వినియోగించే సోయిలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రూ.3 కోట్ల తూర్పు నియోజకవర్గ అభివృద్ధి నిధులను ముట్టుకోలేదని దుయ్యబట్టారు. నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎంత సేపు భూకబ్జాలు, ప్రజలను దోపిడీ చేయడం, భయపెట్టడం, అక్రమాలకు పాల్పడడంతోనే సరిపోయిందని ఆరోపించారు. అంతేకానీ నగరాభివృద్ధిపై చిత్తశుద్ధే కరువైందన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరంగల్ నగరాన్ని సమస్యల గుండంగా మార్చారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. అభివృద్ధి పనుల పేరిట గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ నేతలు.. నిధుల కేటాయింపు ఊసే ఎత్త లేదన్నారు. ఇష్టారాజ్యంగా పనులను మంజూరు చేయడం, శంకుస్థాపనలతో ప్రజలను నమ్మించి మళ్లీ అధికారంలోకి వచ్చే కుట్రలకు ఒడిగట్టారన్నారు. కానీ ప్రజలు విశ్వసించకపోవడంతో ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. నాటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నగరాభివృద్ధి, సమస్యలు, పరిష్కార చర్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షలు కూడా జరపని దుస్థితంటూ సురేఖ మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

నగరాన్ని అభివృద్ధి చేస్తాం..

గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి సురేఖ వెల్లడించారు. ఇష్టారాజ్యంగా ప్రకటించిన పనులను సమీక్షించి వాటి ఆచరణ, నిధులు, ప్రజల అవసరాలు, నగరాభివృద్ధి ప్రాధాన్య క్రమంలో గుర్తించి పనులు చేపడతామన్నారు. వరంగల్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జీడబ్ల్యూఎంసీ, కుడా పనులతో నగర రూపురేఖలను మారుస్తామన్నారు. నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చడం ద్వారా ఆదాయం, ఉద్యోగావకాశాలు నెలకొంటాయన్నారు. అలాగే నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ తప్పిదాలు నగరానికి శాపంగా పరిణమించాయన్నారు. మురికివాడలోని ప్రజల సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అమరవీరులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్లకు చెప్పినట్లు వివరించారు. వరంగల్‌లో ఇంద్రవెల్లి తరహాలో అమరులను స్మరించే సభను నిర్వహించే ఆలోచనతో ఉన్నట్లు సురేఖ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వరంగల్‌లోని బెస్ టెర్మినల్, స్టేడియం ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం రేవంత్‌రెడ్డిని వరంగల్‌కు తీసుకురానున్నట్లు మంత్రి సురేఖ చెప్పారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్



హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విభజన హామీలు - కేంద్రప్రభుత్వం వివక్షత - దగాపడ్డ వరంగల్ ' అనే అంశంపై నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

ఓరుగల్లు ఒక చారిత్రాత్మకమై పోరుగల్లు అని, చాకలి ఐలమ్మ పోరాట వారసత్వం, బందగీ, కాళోజీ, ఆచార్య జయశంకర్ వరకు కొనసాగిన పోరాట ఘనత ఈ ప్రాంతానిదని అన్నారు. తెలంగాణ ప్రాంతం సుదీర్ఘకాలంగా పాలకుల అణచివేతకు గురైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలను తన పొత్తిళ్లల్లో నింపుకొని ఎంతో మంది త్యాగనిరతితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కోదండరామ్ అన్నారు. వేలాది మంది పోరాటంతో సాధించుకున్న తెలంగాణను దొరల గడీలకు పరిమితమైతే ఇటీవల జరిగిన ఎన్నికల్లో దొరల గడీల పాలనను ఓటు అనే వజ్రాయుధం ద్వారా పాలకుల గడీలను బద్దలు కొట్టి ప్రజాస్వామ్య పాలనను ప్రజలు కోరుకున్నారని అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల విభజనను పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కు పంపాలని, పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర స్థాయి సంస్థలు, ఆస్తులను విభజించాలని, కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా తేల్చాలని, రాష్ట్రంలో హార్టికల్చర్ యూనివర్సిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మరాజన్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ నాయకులు మన్నె బాబురావు, ప్రజాసంఘాల నాయకులు రత్నం కిరణ్, చాప బాబుదొర, జహంగీర్, డోలి సత్యనారా యణ, బొనగాని రవీందర్, గుండు రాంచందర్, వెలిశాల రాజేష్, మనోజ్‌కుమార్, బండి మొగిలి, దుర్గం సారయ్య, అంకేశ్వరపు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలను పునరుద్ధరించాలి



కాళోజీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పౌర స్పందన వేదిక నాయకులు

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 3: పుస్తకాలు మెదడుకు పదును పెడుతాయన్న మేధావుల నినాదాలకు సార్థకత కల్పించకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌరస్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రధాన కార్యదర్శి నల్లెల్ల రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని ప్రజాకవి కాళోజీ నారాయణరావు విగ్రహం ఎదుట శనివారం వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. వరంగల్ నగర పరిసర ప్రాంత మండలాల్లోని గ్రంథాలయాలు రెండేళ్లుగా మూతపడి శిథిలావస్థకు చేరి నిర్వహణ అధ్వాన్నంగా మారిన అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు.

ఈ సందర్భంగా పౌరస్పందన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు మాట్లాడుతూ.. ప్రజా కవులుగా పేరొందిన కాళోజీ సోదరుల జన్మస్థలమైన మడికొండ గ్రామంలో 30 ఏళ్ల కిందట ఏర్పడిన గ్రంథాలయం రెండేళ్లుగా మూతపడి గోడలు కూలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గీసుగొండ మండల కేంద్ర గ్రంథాలయం, వరంగల్‌లోని రామన్నపేట గ్రంథాలయం, హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థలకు నిర్వహణ కొరవడిందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ సంస్థ మేలుకొని శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలన్నింటిని పునరుద్ధరించి గ్రామాల్లోని విద్యార్థులు పోటీ పరీక్షల మేథో వికాసానికి తోడ్పాటు నందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముగిసిన దరఖాస్తుల ఘట్టం



వరంగల్ పార్లమెంట్ స్థానం కోసం దరఖాస్తు అందచేస్తున్న పిడమర్తి రవి

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: రానున్న పార్లమెంట్ ఎన్నికల క్రమంలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఘట్టం ముగిసింది. నాలుగు రోజులుగా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తుల స్వీకరణ క్రమంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు దరఖాస్తులను సమర్పించారు. శనివారం చివరి రోజు కావడంతో ఈ రెండు స్థానాల నుంచి ఆశావహులు డబుల్ డిజిట్‌లో ఉండడంతో దరఖాస్తుల పరంపర కొనసాగింది. ఇప్పటిపే వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా రాజకీయ ఆరంగేటం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఢిల్లీకి ఫైనల్ లిస్ట్

దరఖాస్తుల ముగింపుతో ఈనెల 8లోగానే స్క్రీనింగ్ పూర్తి చేసి ముగ్గురేసి అభ్యర్థులతో కూడిన జాబితాను టీపీసీసీ ఢిల్లీకి పంపనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం అధిష్ఠానం ఎంపిక ప్రకియను చేపట్టి 15 నుంచి 18వ తేదీలోగానే అభ్యర్థుల ఎంపిక పూర్తి ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.



కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు

సంగెం, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంటు సీట్ కోసం సంగెం మండల కేంద్రానికి చెందిన దళిత వర్గానికి చెందిన గుండేటి రాజారాం దరఖాస్తు చేసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ రిజర్వు అయిన వరంగల్ పార్లమెంటు టిక్కెట్ కోసం జిల్లా నుంచి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దళితుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ఉద్యమాలు చేస్తున్నట్లు చెప్పారు.



దరఖాస్తు సమర్పిస్తున్న రాజారాం →

తమ్ముడిని హత్య చేసిన అన్న

నందిగామలో శనివారం రాత్రి ఘటన



కుండే కుమారస్వామి మృతదేహం

నల్లబెల్లి, ఫిబ్రవరి 3: కుటుంబ కలహాలతో జరిగిన ఘర్షణలో సొంత తమ్ముడిని కత్తితో గొంతు కోసి హత్య చేసిన ఘటన శనివారం రాత్రి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.

నందిగామకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన కుండే ఐలమ్మ, మొండయ్యలకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు కుండే కుమారస్వామి(30)కి గతంలో పెళ్లి కాగా, సుమారు మూడేళ్ల క్రితం విడాకులు తీసుకోగా, పిల్లలు లేరు. అప్పటి నుంచి పెయింట్ పని చేసుకుంటుండగా, వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ బానిసయ్యాడు. తల్లిదండ్రులు పెద్దకుమారుడితో ఉంటుండగా, ఇదే ఇంట్లో మరో వాటాలో చిన్న కుమారుడు కుమారస్వామి ఉంటున్నాడు. కుటుంబ కలహాలు, మద్యం మత్తులో గొడవలతో కుమారస్వామి, అతడి అన్న కుండే రవి మధ్య తరచూ గొడవలు జరిగేవి. వీటికి తోడు ఇటీవల అన్నదమ్ముల మధ్య ఇంటి స్థలం (సుమారు గుంటన్నర) విషయంలో గొడవలు మొదలయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య గొడవలు సైతం పెరిగాయి. శనివారం రాత్రి కుమారస్వామి మద్యం తాగి ఇంటికి వచ్చాడు.

ఈనేపథ్యంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో కోపంతో అన్న రవి, కుమారస్వామిని ఇంట్లో ఉన్న గొర్రెలను కోసే కత్తి తెచ్చి కుమారస్వామి గొంతు కోశాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కేకలు వేయడంతో రవి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదని, నిందితుడు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితుడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడన్నారు. కేసు విచారణ జరిపి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఉర్సులో ఆధ్యాత్మిక శోభ

కులమతాలకు అతీతంగా ప్రత్యేక ప్రార్థనలు
భక్తులతో కిక్కిరిసిన పరిసరాలు

కరీమాబాద్, ఫిబ్రవరి 3: వరంగల్ నగరంలోని ఉర్సు మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలతో పరిసరాలు సందడి సందడిగా మారాయి. శుక్రవారం ప్రారంభమైన ఉర్సు రెండో రోజు శనివారం రెండో రోజుకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి సందల్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఉత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దర్గాను సందర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో ఉర్సు దర్గా ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది సంఖ్యలో వచ్చిన సందర్శకులు, భక్తులు కుల మతాలకు అతీతంగా దర్శించుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. దర్గా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. భక్తులకు నయిగడిలో పీఠాధిపతులు అన్నదానం నిర్వహించారు. అలాగే, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఫకీర్లు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రవిత్ర సమాధిపై సమర్పించే చాదర్‌ల ఊరేగింపులో (జులుస్) కార్యక్రమంలో ఫకీర్లు పాల్గొని పలు విన్యాసాలు చేశారు. ఉర్సు సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

దర్గా అభివృద్ధికి సహకరిస్తాం: మంత్రి సురేఖ

ఉర్సు హజ్రత్ సయ్యదాన మాషూక్ రబ్బాని రహమతుల్లా అలై దర్గా అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సందర్శించారు. శనివారం రాత్రి ఉర్సులోని పీఠాధిపతుల నివాసమైన నయాగడీలో దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ ఉబేద్ బాబాలను కలిసి ఉర్సు ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంతో పవిత్రమైనదని, విశ్వాసంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారన్నారు. ఎంతో మహిమాన్వితమైన ఈ దర్గాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అన్ని రకాలుగా సహకరిస్తామని అన్నారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా గత నెల రోజుల క్రితం సందర్శించి ఉత్సవాలకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గ్రేటర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబాలు దర్గా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిరిసిల్ల రాజయ్య మీసాల ప్రకాష్, కార్పొరేటర్ మరుపల్ల రవి, కాంగ్రెస్ నాయకులు కేడల పద్మ, మంతెన సునీత తదితరులు ఉన్నారు.



పవిత్ర సమాధికి సంధల్‌ను తీసుకొస్తున్న పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా



సందర్శకులతో నిండిపోయిన దర్గా ప్రాంగణం



పీఠాధిపతులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 3: వరంగల్ పోలీసు కమిషనరేట్ గీసుగొండ మండలకేంద్రంలో బెల్ట్‌షాపులపై శనివారం వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సుమారు రూ.13వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ గ్రామంలో పాకనాటి స్వరూప అనే మహిళ చాలాకాలంగా ఇంటిని అడ్డాగా చేసుకుని అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది.

దీంతో తమ సిబ్బంది మూకుమ్మడి దాడులు చేయడంతో ఇంటో రూ.13వేల విలువగల వివిధ రకాలైన మద్యం లభించింది. పట్టుకున్న మద్యాన్ని గీసుగొండ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్‌ను పట్టించుకోని గత ప్రభుత్వం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, ఫిబ్రవరి 3: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, దీంతో ఏడేళ్లుగా పనులు నత్తనడక సాగుతున్నాయని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. శాయంపేటహవేలి వద్ద నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఎమ్మెల్యే రేవూరి శనివారం సందర్శించి ఆయా కంపెనీలు చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎంవోయూలు చేసుకున్న కంపెనీలు ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. పార్కులో ఉపాధి అవకాశాల్లో భూములు కోల్పోయిన వారి మొదటి ప్రాధాన్యం, గీసుగొండ, సంగెం మండలాల ప్రజలకు రెండో ప్రాధాన్యం, నియోజకవర్గ ప్రజలకు మూడవ ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఎంవోయూలు చేసుకున్న కంపెనీలు త్వరగా పనులు చేపట్టేలా పరిశ్రమలశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, జనరల్ మేనేజర్ సంతోష్ పాల్గొన్నారు.



ఎంవోయూలు చేసుకున్న కంపెనీ వివరాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న అధికారులు

టీఎస్‌యూటీఎఫ్ ఎన్నికలు

వరంగల్ మండల శాఖకు కొత్తకార్యవర్గం

గిర్మాజీపేట, ఫిబ్రవరి 3: గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్(జీపీఎస్)లో లక్ష్మీపురం పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ మండల మహాసభ, నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. ఎన్నికల అధికారిగా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు సుజన్ ప్రసాదరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఎలను వెంటనే ప్రకటించాలని, నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా వైద్యానికి కేటాయింపులు లేవని, కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహించే విధంగా ఉందని పన్నుల స్లాబులలో మార్పు లేదన్నారు. అనంతరం కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షుడు దుద్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి బాదావత్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పి.శాంత, కె.కుమారస్వామి, కోశాధికారి పొన్నం రవిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.రమేష్, డి.సమ్మక్క, జి.కరుణాకర్, ఎమ్డీ అమ్జద్, నారాయణ పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతర గోడ పత్రిక ఆవిష్కరణ



జాతర గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

కరీమాబాద్, ఫిబ్రవరి 3: అమ్మవారిపేట సమ్మక్క, సారలమ్మ జాతరకు సంబంధించిన గోడ పత్రికలను శనివారం దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హన్మకొండలోని 'కుడా' కార్యాలయంలో ఆవిష్కరించారు. అమ్మవారిపేట సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ కోడూరి భిక్షపతి ఆధ్వర్యంలో సురేఖతో గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, ఆర్గనైజర్స్ దాసి రాందేవ్, ధర్మకర్తలు ఆవునూరి కుమారస్వామి, ఆవునూరి రామ్మూర్తి, ఆవునూరి రవి, ఆవునూరి(గడ్డం) కుమారస్వామి, కాంగ్రెస్ నాయకురాలు మంతెన సునీత, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, బత్తిని వసుంధర, కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పదవిని కేటాయించాలి

ఖిలావరంగల్ : గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న తనకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిద వీరన్న అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖామంత్రి సురేఖకు వినతిపత్రాన్ని అందజేశారు. శనివారం 'కుడా' కార్యాలయంలో జరిగిన సమావేశానికి వచ్చిన మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేశానని, మూడుసార్లు ఎంపీ ఎన్నికలకు, నాలుగు సార్లు ఎమ్మెల్యే ఎన్నికలకు కొండా దంపతుల ఆదేశాల మేరకు పనిచేయడం జరిగిందన్నారు. వరంగల్ అర్బన్ కో-కన్వీనర్‌గా, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ప్రధానకార్యదర్శిగా, పరకాల, వర్ధన్నపేట, హనుమకొండ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్‌పర్సన్‌గా మధుసూదన్



మేడిది మధుసూదన్

కరీమాబాద్, ఫిబ్రవరి 3: వాకర్స్ ఇంటర్నేషనల్ 303 సెక్టార్‌లో 19 జిల్లాలకు సంబంధించి జోనల్ చైర్‌పర్సన్‌గా కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మేడిది మధుసూదన్ ఎన్నికయ్యారు. ఉర్సు రంగలీలా మైదానం వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మధుసూదన్‌కు ఈ గుర్తింపు లభించడంతో అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కాగా తన నియామకానికి సహకరించిన రంగలీలా మైదానం వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు, వాకర్స్ ఇంటర్నేషనల్ 303 సెక్టార్ ప్రధాన విభాగాధిపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో ఇంటర్నేషనల్ గవర్నర్‌చే ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేస్తున్న ఎంపీపీ

సంగెం, ఫిబ్రవరి 3: సంగెంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పద్మశాలి కుటుంబ సభ్యులకు అండగా ఉండి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఐబీ ఏఈ సాయిరాజు, రోహిణి, మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు నరహరి, ఓంప్రకాష్, అనూష, రమేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కరపత్రాల ఆవిష్కరణ

శంభునిపేట, ఫిబ్రవరి 3 : రంగశాయిపేట గణేష్‌నగర్‌లో ప్రతిష్ఠించనున్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శనివారం వేదపండితుల సమక్షంలో కమిటీ బాధ్యులు ఆవిష్కరించారు. వేద పండితులు మాట్లాడుతూ మార్చి 30న విశ్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, 31న గ్రామోత్సవం, యాగశాల, ఏప్రిల్ 1న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లకు షోకాజ్ నోటీసు

నర్సంపేట, ఫిబ్రవరి 3 : బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, 12వ వార్డు కౌన్సిలర్ ఎండి. పాషా, 24వ వార్డు కౌన్సిలర్ దార్ల రమాదేవిలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం విషయంలో పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా, పార్టీ సమన్వయానికి సహకరించకుండా స్థానిక పార్టీ నాయకత్వానికి అందుబాటులో లేకుండా క్యాంపు నిర్వహించినందుకు పట్టణ పార్టీ షోకాజ్ నోటీస్ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. వారం రోజుల్లో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని యెడల వీరిపై పార్టీ సరైన చర్యలు తీసుకుంటుందన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రాగ్యానాయక్

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 3: విద్యార్థులు ఆత్మరక్షణతోపాటు ఆత్మస్థైర్యంతో ఉండాలని అడిషనల్ డీసీపీ ఎల్.రాగ్యానాయక్ సూచించారు. శనివారం ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ఆధ్వర్యంలో హంటర్ రోడ్‌లోని ఉర్సుగుట్ట మహాత్మ జ్యోతిబా ఫూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాగ్యానాయక్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్ జరిగితే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. ప్రతీ విద్యార్థి ఆత్మరక్షణ విధానాలను నేర్చుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం, లేబర్ ట్రాఫికింగ్, లైంగిక దోపిడి, అవయవాల అక్రమ అమ్మకాలు, బాల్య వివాహాలు, బాలల లైంగిక వేధింపులు, సైబర్ మోసాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సీఐ వెంకట్రామ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ కె. వసుధ, ఇన్‌చార్జ్ డీసీపీవో రాజు, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ శ్వేత, ఎల్‌సీపీవో సురేష్, వివిధ శాఖల అధికారులు మల్లేష్, ఫసీయుద్దీన్, ఫిలిప్‌రాజు, భాగ్యలక్ష్మి, వని, ప్రిన్సిపాల్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన



అంగన్‌వాడీ టీచర్స్‌కు అవగాహన కల్పిస్తున్న మౌనిక

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 3: నగరంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్‌లో కార్పొరేటర్ ఎండి.ఫుర్కాన్ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ మౌనిక ఆధ్వర్యం లో 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అంగన్‌వాడీ టీచర్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారికి నులిపురుగుల నివారణ మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

మునిసిపల్ సిబ్బందికి చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

మామునూరు, ఫిబ్రవరి 3 : నగరంలోని 17వ డివిజన్ బొల్లికుంటకు చెందన మునిసిపల్ మహిళా సిబ్బందికి చీరలు అందించారు. శనివారం ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మచ్చిక రాజు గౌడ్ జన్మదినం సందర్భంగా మునిసిపల్ సిబ్బందికి చీరలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు గౌడ్, జవాన్ బండి శ్రీధర్, కందిక స్వామి, పసునూరి శ్రీధర్, మధుకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ డే పోటీలు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 3: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, కవిత్వం, పాటలు, వక్తృత్వం తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9న హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో ఒక్కో అంశంలో ఒక్కో పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలన్నారు. ఆసక్తి గల విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులకు 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే సైన్స్ డే వేడుకల్లో బహుమతులు అందజేస్తారని తెలిపారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్(98488 78455)ను సంప్రదించాలని ఆమె సూచించారు.

నిరంతర విద్యుత్ సరఫరా

మట్టెవాడ, ఫిబ్రవరి 3: రైతాంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ కొత్తపేటలో ఆయన పర్యటించి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డీఈలు అనిల్, మల్లికార్జున్, ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసులు అంకిత భావంతో పనిచేయాలి

రాష్ట్ర పోలీసు హౌసింగ్ సొసైటీ కార్పొరేషన్ ఐజీ రమేష్



ఫైరింగ్ రేంజ్‌లో మొక్క నాటుతున్న ఐజీ రమేష్

మామునూరు, ఫిబ్రవరి 3 : పోలీసులు అంకితభావంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ సొసైటీ కార్పొరేషన్ ఐజీ ఎల్.రమేష్ అన్నారు. మామునూరులోని టీఎస్ఎస్పీ 4వ బెటాలియన్‌ను ఐజీ శనివారం సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి ఐజీని స్వాగతించి బెటాలియన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అమ్మవారిపేట వద్ద గల ఫైరింగ్ రేంజ్‌ని సందర్శించి, మొక్కను నాటారు. కార్యక్రమంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, ఐపీఎస్ అధికారి వరంగల్ క్రైమ్ డీసీపీ మురళీధర్, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐలు శోభన్, రాజిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేస్తున్న నాలుగో బెటాలియన్ పోలీసులు

మామునూరు, ఫిబ్రవరి 3 : పోలీసులు సామాజిక సేవలో ముందుండాలని నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మామునూరు టీఎస్ఎస్పీ ఏ కంపెనీ ఆన్యువల్ రిఫ్రెషర్ కోర్సులో భాగంగా కమాండెంట్ ఆదేశానుసారం సిబ్బంది శనివారం హనుమకొండ జిల్లాలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజిరెడ్డి, ఆర్ఎస్ఐలు శ్రీహరి, కార్తీక్, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈవీఎం, వీవీప్యాడ్‌ల తనిఖీలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3: జిల్లాకు చెందిన వీవీ ప్యాడ్, ఈవీఎంల మొదటి దశ తనిఖీ కార్యక్రమం ఈనెల5 నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు వరంగల్ ఏనుమాముల ప్రాంతంలోని గోదాంలో ఈనెల 5 నుంచి 14 వరకు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉపయోగించుటకు గాను మొదటి దశ తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పోటీ చేసే అభ్యర్థులతో పాటు జిల్లాకు చెందిన మూడు నియోజక వర్గాలకు సంబంధించి ఎఫ్ఎల్‌సీ మొదటి దశ తనిఖీ బ్యాలెట్ యూనిట్లు 1906 కంట్రోల్ యూనిట్లు 1262 వీవీ ప్యాడ్‌లో 1219 జిల్లాకు సంబంధించి కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేయుటకు కలెక్టర్ ఆదేశించారు.

చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లకు షోకాజ్ నోటీసు

నర్సంపేట, ఫిబ్రవరి 3 : బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, 12వ వార్డు కౌన్సిలర్ ఎండి.పాషా, 24వ వార్డు కౌన్సిలర్ దార్ల రమాదేవిలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం విషయంలో పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా, పార్టీ సమన్వయానికి సహకరించకుండా స్థానిక పార్టీ నాయకత్వానికి అందుబాటులో లేకుండా క్యాంపు నిర్వహించినందుకు పట్టణ పార్టీ షోకాజ్ నోటీస్ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. వారం రోజుల్లో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని యెడల వీరిపై పార్టీ సరైన చర్యలు తీసుకుంటుందన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలు


రాయపర్తిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి, ఫిబ్రవరి 3 : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పలువురు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో, బస్టాండ్‌లో రోగులకు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాండ్ల తిరుపతిరెడ్డి, మహమూద్, రమేష్, కుంట రమేష్, అఫ్రోజ్, మల్లయ్య, రాజేంద్రప్రసాద్, శ్రీను, బాబు, ప్రభాకర్, కృష్ణారెడ్డి, వెంకన్న, విజయ్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్

ఆర్ఎస్‌పీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్


మాట్లాడుతున్న వల్లందాస్ కుమార్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, ప్రజా వ్యతి రేక బడ్జెట్ అని రివల్యూష నరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా కార్య దర్శి వల్లందాస్ కుమార్ అన్నారు. శని వారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గత పది వార్షిక బడ్జెట్‌లను పరిశీలిస్తే వ్యవసాయ రంగానికి, విద్య, వైద్య, నిరుద్యోగ యువతకు కేటాయింపులను భారీగా తగ్గిస్తూ వస్తున్నట్లు అర్థం అవుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన వ్యవసాయ అనుబంధ రంగాలకు గత దశాబ్దాల కాలంగా బడ్జెట్ కేటాయింపు తగ్గిస్తూ రైతు వ్యతిరేక, కార్పొరేట్ శక్తులకు అనుకూలల వైఖరి చాటుకుంటున్న వైనాన్ని ప్రజలు గమనించాలన్నారు. రైతు, పేద, మధ్య తరగతి వ్యతిరేక బడ్జెట్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు జిల్లా నాయకులు బి.భద్రయ్య, దుబ్బర సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ రైతు సంఘం ఆందోళన


నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు సంఘం నేతలు

నర్సంపేట, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నర్సంపేట పట్టణంలోని అమర వీరుల స్థూపం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు మాట్లాడుతూ వ్యవసాయరంగ అభివృద్ధికి నిధులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆర్థిక మంత్రి పదే పదే బడ్జెట్ ఉపన్యాసంలో చెప్పినా, వాస్తవ బడ్జెట్‌లో అందుకు సంబంధించిన కేటాయింపులు చేయకపోగా, కార్పొరేట్లకు వ్యవసాయరంగాన్ని కట్టబెట్టేందుకు పూనుకున్నదన్నారు. దేశం బాగు పేదలు, యువకులు, మహిళలు, రైతులు మాత్రమేనని చెప్పినప్పటికీ ఆచరణలో చేసింది శూన్యమన్నారు. గతంలో ఉపసంహరించుకున్న మూడు నల్ల చట్టాలను మరో కోణంలో అమలు చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని, దీన్ని ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి, అక్కపెల్లి సుధాకర్, గొర్రె సంజీవరెడ్డి, నర్సింహరాములు పాల్గొన్నారు.

నర్సంపేట డిపో అద్దె బస్సు డ్రైవర్ల వేతనాల పెంపు


యాజమాన్యంతో హర్షం వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

నర్సంపేట, ఫిబ్రవరి 3 : నర్సంపేట డిపోలో పనిచేస్తున్న టీఎస్ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు, యాజమాన్యానికి జరిగిన చర్చలు సఫలం కావడంతో డ్రైవర్ల వేతనాలు పెంచుతూ యాజమాన్యం శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో డ్రైవర్లు హర్షం వ్యక్తంచేశారు. ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు రూ. 15వేల నుంచి రూ. 18వేలు, ఆర్డినరీ బస్సు డ్రైవర్‌కు రూ. 13వేల 500 నుంచి రూ. 16వేలు, క్లీనర్‌కు రూ.3700 నుంచి రూ.4వేలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి


లక్ష్మణ్ (ఫైల్)

చెన్నారావుపేట, ఫిబ్రవరి 3 : ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని సూర్యపేట గ్రామ శివారులలో శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనువాస్ కథనం ప్రకారం... సూర్యపేట తండాకు చెందిన దారావత్ లక్ష్మణ్(40) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. లక్ష్మణ్ తెల్లవారు జామున 3గంటల సమయంలో కిరాయికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో ఆటో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడడంతో అక్కడక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య కూతురు, కుమారుడు ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనువాస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సంపేట ఆస్పత్రిలో పోస్టుమార్టానికి తరలించారు., కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఒక్క క్లిక్‌తో మహిళా సంఘాల వివరాలు..!

- లోకోస్ యాప్ ద్వారా పూర్తి సమాచారం
- ప్రారంభమైన వివరాల నమోదు
- బినామీ సభ్యులకు చెక్
- నగదు రహిత లావాదేవీలపై దృష్టి


ఇల్లందలో లోకోస్ యాప్ పై అవగాహన కల్పిస్తున్న ఐకేపీ అధికారులు (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 3 : మహిళా సంఘాల్లో సైతం ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సరికొత్త విధానాన్ని తీసుకువస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యాప్‌ను ప్రవేశపెట్టి వాటి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా ఉండాలనే ఆలోచనతో లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ మధ్య కాలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన వైపుగా అడుగులువేస్తున్నారు. ఇచ్చిన రుణంతో వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబానికి భరోసా ఇస్తున్నారు. దీంతో జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీ వుడ్ మిషన్) ఆధ్వర్యంలో ప్రతి సభ్యురాలి బ్యాంకు ఖాతాను ఆధార్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. పొదుపు, రుణాల లావాదేవీలు యాప్‌లో పొందుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వర్ధన్నపేట మండలంలో లోకోస్ యాప్‌పై డీఆర్డీఏ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

• మండలంలో ఇలా...

వర్ధన్నపేట మండలంలోని 18 గ్రామాల్లో 36 సంఘాలు ఉన్నాయి. ఎస్‌హెచ్ జీఎస్ గ్రామైఖ్య సంఘాలు 848 ఉండగా అందులో మహిళా సంఘాల సభ్యులు 9298 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటికే సభ్యులందరివీ ఆధార్, బ్యాంకు లింకేజీలు ఇప్పటికే పూర్తయ్యాయి. మండల సమైఖ్యనుంచి గ్రామ సంఘాలకు సీఐఎఫ్ నుంచి రూ. 2.40 కోట్ల రుణాలు అందినట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి. వీటిలో సీఐ ఎఫ్ రికవరీ శాతం 99శాతం ఉన్నట్లు తెలిపారు. ఇందులోని సంఘాల లెక్కలు, పొందిన రుణాలు, చెల్లించే వడ్డీ, ఇతర కార్యకలాపాల వివరాల్లో పారదర్శకతకోసం లోకోస్ యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఈ నూతన విధానంతో జాతీయ స్థాయిలో పొదుపు సంఘాల వివరాలు ఒకే చోట లభించనున్నాయి. ఆర్థిక లావాదేవీలు, పొదుపు, ఇతర వివరాలు తెలుసుకునేందుకు ఎంతో సులువుగా ఉంటుంది. మండల వ్యాప్తంగా అనుసంధాన కార్యక్రమాన్ని అడిషన్ డీఆర్డీఏఆఫీసర్ గొట్టె శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

• బినామీ సభ్యులకు చెక్...

లోకోస్ యాప్‌లో వివరాలు పొందు పరచటం వలన బినామీ సభ్యులకు చెక్ పడనుంది. బోగస్ సంఘాలు లేకుండా ఉండడంతోపాటు రెండు చోట్ల మహిళా సంఘాల్లో సభ్యులు ఉండకుండా వివరాలు కనిపిస్తాయి. వాస్తవంగా ఎవరైతే రుణం తీసుకుని సక్రమంగా చెల్లించి ఆర్థికంగా బలోపేతం అవుతున్నారో వారి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. కొన్ని చోట్ల ఒకే మహిళ రెండు సంఘాల్లో సభ్యురాలిగా కొనసాగుతూ రుణం తీసుకుంటే వాటిని వెంటనే గుర్తించే అవకాశం ఉంది. అలాంటి వారు ఉంటే వెంటనే తొలగిస్తారు.

• నగదు రహిత లావాదేవీలు...

ప్రతీ మహిళా నగదు రహిత లావాదేవీలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే రోజుల్లో కాగిత రహిత సేవలు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌సేవలు ఎలాంటి పొందాలి. ఇతర విషయాలపై మహిళా సంఘాలకు ఇప్పటి నుంచే వివరిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానంచేసే ప్రక్రియ సైతం ఇప్పటికే కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ద్వారా పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెపుతున్నారు.

• వందశాతం రుణాల రికవరీ...

వీర్ల వేణు, డీఆర్డీఏ ఏపీఎం, వర్ధన్నపేట



మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను వంద శాతం రికవరీ చేస్తున్నాం. గ్రామైఖ్య సంఘాల వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేస్తున్నాం. డీఆర్డీఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని సంఘాల వీవోఏలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆధార్ అనుసంధానం, బ్యాంకు లింకేజీల పట్ల సైతం సీఏలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పనిచేస్తున్నారు.

విద్యార్థులకు సైన్స్ డే పోటీలు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 3 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈ వో డి.వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, కవిత్వం, పాటలు, వక్తృత్వం తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9న హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో నిర్వ హించే జిల్లాస్థాయి పోటీల్లో ఒక్కో అంశంలో ఒక్కో పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలన్నారు. ఆసక్తిగల విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులకు 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే సైన్స్ డే వేడుకల్లో బహుమతులు అందజేస్తారని తెలిపారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్ (98488 78455)ను సంప్రదించాలని ఆమె సూచించారు.

జిల్లా ఆస్పత్రి రోగులకు పండ్ల పంపిణీ

నర్సంపేట, ఫిబ్రవరి 3: తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ జన్మదినం సందర్భంగా శనివారం నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ పేద రోగులకు, అనాథలకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బెజ్జంకి ప్రభాకర్, ఎర్రబోయిన రాజశేఖర్, నాగెల్లి సారంగం, రాము తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 3: విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యావేత్త మోతె సమ్మిరెడ్డి అన్నారు. నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలోని శివాని పబ్లిక్ స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు శనివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ సైన్స్ పరిశోధన ఫలితాలు సామాన్య ప్రజానికానికి చేరువకావాలని, సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెరగాలని అన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొం దించుకొని నిరంతరం పరిశోధనలు, ప్రయోగాలు చేసుకుంటూ భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పెండెం భాస్కర్, గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ట్రస్మా డివిజన్ అధ్యక్షుడు పి. భాస్కర్, డాక్టర్ జయుడు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


డైరీని ఆవిష్కరిస్తున్న భవన సంఘ నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్ర జావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16వ తేది నుంచి జరిగేసార్వత్రిక సమ్మె లో నిర్మాణ రంగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతగిరి రవి అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానా లపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా 60ఏళ్ల పైబడిన కార్మికులందరికీ రూ.10వేల పించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పైడయ్య నరేందర్, స్వామి, మధు, పాల్గొన్నారు.

హైదరాబాద్ సభకు తరలిన ఆరె కులస్థులు

దుగ్గొండి, ఫిబ్రవరి 3 : ఆరె కులస్థుల ఓబీసీ సాధనకై హైదరాబాద్‌లో శనివారం తల పెట్టిన బహిరంగ సభకు మండలం నుంచి వివిధ గ్రామాల నుంచి ఆరె కులస్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని గిర్నిబావిలో ఆరె సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఒలిగె నర్సింగరావు, గుండెకారి రవికుమార్‌లు తరలి వెళ్తున్న వాహనాలకు జెండా ఊపారు. వివిధ గ్రామాల నుంచి తరలి వెళ్లిన వారిలో ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లాండె రమేశ్ , గడ్డి కృష్ణంరాజు, కొల్లూరి రాజు, రఘుసాల చిరంజీవి, హింగె రాజు, మోర్తాల రవి, లోను శ్రీనివాస్, రంపీస చిరంజీవి, మోకిడె లింగరావు, లాసాని సురేశ్, చందర్‌రావు, రామారావు, శ్రావణ్, వామన్‌రావు, సాంబశివరావులు ఉన్నారు.

ఉప్పరపల్లి పాఠశాలకు ప్రింటర్ బహూకరణ


డీఈవో వాసంతి చేతుల మీదుగా ప్రింటర్‌ను బహూకరణ చేస్తున్న దాత

చెన్నారావుపేట, ఫిబ్రవరి 3: మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలకు రూ. 21 వేల విలువ చేసే ప్రింటర్‌ను శనివారం పాఠశాలకు దాత బహూకరించారు. గతంలో ఎఫ్ఏసీహెచ్ఎంగా పనిచేసి ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కాటారం హెచ్ఎంగా పని చేస్తున్న జన్నుపురెడ్డి ఉమారాణి వారి తల్లి జన్నుపురెడ్డి సంధ్యారాణి జ్ఞాపకార్థం రూ 21 వేల విలువ చేసే ప్రింటర్‌ను డీఈవో వాసంతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్‌ను అందించటం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి ఫ్లోరెన్స్ సుధీర్‌బాబు, కృష్ణామూర్తి, డాక్టర్ శ్రీనువాస్, ఎంఈవో రత్నమాల, సలీం, పాపమ్మ, రవిందర్, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఖానాపురం, ఫిబ్రవరి 3: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి జ్యోతి అన్నారు. శనివారం ఐనపల్లి గ్రామంలోని జ్యోతిబా పూలే బాలిక రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాధారణ జలుబు జ్వరం, స్కిన్ ఎలర్జీ, రక్తహీనత తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు రామలింగయ్య, శ్రీలత, స్రవంతి, ఏఎన్ఎం జ్యోతి, హెచ్ఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలి

దుగ్గొండి, ఫిబ్రవరి 3 : ఈ నెల 12న జరిగే జాతీయ నులి పురుగు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్ రాజు పిలుపు నిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమావేశంలో డాక్టర్ కిరణ్‌రాజు మాట్లాడుతూ 1 నంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులి పురుగుల నివారణ మందులను వేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, హెచ్ఈవో సాంబయ్య పాల్గొన్నారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న

నందిగామలో శనివారం రాత్రి ఘటన


కుమారస్వామి మృతదేహం

నల్లబెల్లి, ఫిబ్రవరి 3: కుటుంబ కలహాలతో జరిగిన ఘర్షణలో సొంత తమ్ముడిని కత్తితో గొంతు కోసి హత్య చేసిన ఘటన శనివారం రాత్రి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.

నందిగామకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన కుండే ఐలమ్మ, మొండయ్యలకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు కుండే కుమారస్వామి(30)కి గతంలో పెళ్లికాగా, సుమారు మూడేళ్ల క్రితం విడాకులు తీసుకోగా, పిల్లలు లేరు. అప్పటి నుంచి పెయింట్ పని చేసుకుంటుండగా, వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ బానిసయ్యాడు. తల్లిదండ్రులు పెద్దకుమారుడితో ఉంటుండగా, ఇదే ఇంట్లో మరో వాటాలో చిన్న కుమారుడు కుమారస్వామి ఉంటున్నాడు. కుటుంబ కలహాలు, మద్యం మత్తులో గొడవలతో కుమారస్వామి, అతడి అన్న కుండే రవి మధ్య తరచూ గొడవలు జరిగేవి. వీటికి తోడు ఇటీవల అన్నదమ్ముల మధ్య ఇంటి స్థలం (సుమారు గుంటన్నర) విషయంలో గొడవలు మొదలయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవలు సైతం పెరిగాయి. శనివారం రాత్రి కుమారస్వామి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో కోపంతో అన్న రవి, కుమారస్వామిని ఇంట్లో ఉన్న గొర్రెలను కోసే కత్తి తెచ్చి కుమారస్వామి గొంతు కోశాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కేకలు వేయడంతో రవి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదని, నిందితుడు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితుడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడన్నారు. కేసు విచారణ జరిపి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

వరిసాగులో కలుపు చర్యలు పాటించాలి

గడ్డిజాతి మొక్కలు నివారిస్తేనే అధిక దిగుబడి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 3 : ప్రస్తుత రబీ సీజన్‌లో బోర్లు, బావులు, చెరువుల ద్వారా వేసిన వరి నాట్ల పనులు పూర్తి కావచ్చాయి. వరి సాగు చేసే రైతులు ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్యమైనది కలుపు నివారణ. పొలంలో కలుపు కారణంగా రైతులు తగిన దిగుబడులు పొందలేక తీవ్రంగా నష్టపోతుంటారు. దిగుబడిపై తీవ్రంగా ప్రభావితం చేసే కలుపును నివారించడానికి సకాలంలో చర్యలు తీసకోటవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. వరిసాగులో ప్రధానంగా కలుపు యియాజమాన్యం పాటించాలి.

నేరుగా విత్తిన వరి పొలంలో...

ఈ పద్ధతిలో 24-48 గంటలు నానబెట్టి మొలక కట్టిన వరి విత్తనాన్ని విత్తేటప్పుడు ఈ మందుల్లో ఏదైన ఒక దానిని వాడాలి.

- ప్రెటిలాక్లోర్, సేఫ్‌నర్ మందును ఎకరానికి 600 మి.లీ నుంచి 800 మి.లీ వరకు విత్తిన 3 నుంచి 5 రోజులలోపు వాడాలి.
- పైరజోసల్ఫ్యూరాన్ ఈథైల్ మందును ఎకరానికి 80-100 గ్రాములు, విత్తిన 8-10 రోజులలోపు వాడాలి. ఇది గడ్డిజాతి కలుపు మొక్కలను నివారిస్తుంది.
- బ్యూటాక్లోర్ 1-1.25 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ మందును 500 మి.లీ ఎకరానికి వాడాలి.
- సైహలోఫాప్ పీడబ్యూటైలా కలుపు మందును ఎకరానికి 300 మిల్లీలీటర్లు విత్తిన 15-20 రోజులలోపు వాడుకోవాలి.
- పినాక్స్ ప్రాప్ పి.ఈథైల్ మందును ఎకరానికి 250 మి.లీ చొప్పున విత్తిన 15-20 రోజులకు వాడుకోవాలి.
- గడ్డిజాతి కలుపు నివారణకు నాటిన 15 నుంచి 20 రోజులకు వాడాల్సిన కలుపు మందుల వివరాలు.
- సైహలో పీడబ్ల్యూటైల్ 300 మి.లీ ఒక ఎకరానికి లేదా పినాక్స్ ప్రోప్ పి.ఇథైల్ ఒక ఎకరానికి లేదా మెట్ సల్ఫురాన్ మిథైల్- క్లోరిమ్యూరాన్ ఇథైల్ అనే మందును 8 గ్రాములు ఒక ఎకరానికి వాడాలి.
- గడ్డిజాతి, వెడల్పు ఆకు కలుపు నివారణకు
- బిస్‌పైర్ బాక్ సోడియం ఎకరానికి 100 మి.లీ అనగా లీటరు నీటికి 0.5 మి.లీ మందును కలిపి 15 నుంచి 20 రోజుల మధ్య పిచికారి చేసుకోవాలి.
- తుంగ జాతి, వెడల్పు ఆకు కలుపు నివారణకు మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్, క్లోరిమ్యూరాన్ ఇథైల్ 8 గ్రాములు ఒక ఎకరానికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- నాటిన 3 నుంచి 5 రోజులలోపు వాడే కలుపు మందులు
- బ్యూటాక్లోర్ 1-1.25 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ 400 మి.లీ నుంచి 600 మి.లీ లేదా ఆక్సడయార్జిల్ 35-45 గ్రాములు ఎకరానికి వాడాలి.
- జెన్ సల్ఫ్యూరిక్ మిథైల్ (0.6శాతం), ప్రెటిలాక్లోర్ (6.0శాతం) ఎకరానికి నాలుగు కిలోల గుళికలు వాడాలి.
- పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80-100 గ్రాములు వాడాలి. ఈ మందుల్లో ఏదైనా ఒక దానిని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

ఏవోల సూచనలు పాటించాలి

రాంనర్సయ్య, ఏవో, వర్ధన్నపేట



వరి సాగు చేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. వరి సాగుచేసే రైతులు చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు కలుపు నివారణ చర్యలు చేపట్టాలి.

ఎమ్మెల్యే కూనంనేనిని కలిసిన ఆరెల్లి రవి


ఎమ్మెల్యే కూనంనేనితో ఆరెల్లి రవి

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 3: తెలంగాణ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును శనివారం మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన మండల సీపీఐ కార్యదర్శి ఆరెల్లి రవి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సమితి సమావేశాల్లో భాగంగా ఆరెల్లి రవి ఎమ్మెల్యేను ప్రత్యేకంగా కలిసి మండలంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలను వివరించారు.

చలో రాజ్‌భవన్ విజయవంతం చేయండి


వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మికులు

నెక్కొండ, ఫిబ్రవరి 3 : స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సవరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 8వ తేదిన ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వం అంబానీ, అదాని వంటి బడా కార్పొరేటర్లకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చివేసి కార్మిక హక్కులను కాలరాసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యల వలన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీకాకుండా కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్ విధానాలు అమలవుతుండటూ ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని దినాలకు స్వస్తి పలికి 12గంటల పని విధానాన్ని అమలు చేస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా ఉపా ధ్యక్షుడు మందాటి శ్రీనివాస్, నాయకులు బాలరాజు, బండి వెంకట్, తోట రాజేష్, చంద్రమౌళి, సాంబయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన విద్యుత్ ఏఈకి సన్మానం

దుగ్గొండి, ఫిబ్రవరి 3:మండలంలో విద్యుత్ ఏఈగా విధులు నిర్వహించిన ఏఈ సురేశ్‌కుమార్ కరీంనగర్‌కు బదిలీ కాగా శనివారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. సన్మానం చేసిన వారిలో ఏడీఈ లక్ష్మణ్, ఇన్‌చార్జి ఏఈ రామకృష్ణ, లైన్ ఇన్స్‌పెక్టర్ అజీమ్‌పాష, లైన్‌మెన్ రాజు, జేఎల్ఎంలు అజిమ్‌ఖాజా, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చు


సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య సిబ్బంది

చెన్నారావుపేట, ఫిబ్రవరి 3 : అత్యవసర సమయంలో సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడుకోవచ్చునని జిల్లా సీపీఆర్ శిక్షణ అధికారి డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెవెన్యూ, పంచాయితీరాజ్, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్న సమయంలో గుండె పోటుతో మృతి చెందుతున్నారని అన్నారు. ఈ శిక్షణను ప్రతీ ఒకరూ నేర్చుకోవాలన్నారు. ఆపదలో ఉన్నవారిని రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిహెచ్‌వో డాక్టర్ ప్రకాష్, వైద్యాధికారి సరోజ, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో భారతి, సీహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నెక్కొండ, ఫిబ్రవరి 3 : మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో ఫోటో గ్రాఫర్ క్రాంతి కుటుంబ సభ్యులకు మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆర్థిక సాయంగా రూ.15వేలు, నిత్యావసర వస్తువులను అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన క్రాంతి నానమ్మ సుగుణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, ఆమె దశదిన కర్మలు చేయడానికి ఆర్థిక సాయం అందించామని సంఘం మండల అధ్యక్షుడు బీర్రు వేణు తెలిపారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఉపాధ్యక్షుడు బోయిన ఏకాంబ్రం, కార్యదర్శి బానోతు దేవేందర్, కోశాధికారి మాదారపు వినోద్, తాటిపాముల వెంకటేశ్వర్లు, కుడికాల రఘువీర్, దొనికన మధుగౌడ్, నేతల సారంగపాణి ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి, ఫిబ్రవరి 3: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం క్యాలెండర్‌ను శనివారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బండి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వర్కాల పరుశరామ్ మాట్లాడుతూ జీవో నెం. 342ను పునరుద్ధరించాలని, జీవో నెం2ను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీలను ఓపెన్ సీనియారిటీలో కూడా తీసుకోవాలని, ప్రమోషన్స్ బదిలీలు వెంటనే చేపట్టాలని, 317 బాధితులకు సత్వరన్యాయం చేకూర్చి, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూక్యా హరిలాల్, పల్ల అనీల్‌కుమార్, పాక రమేష్, శ్రీధర్, అశోక్, ఉమాదేవి, రాధాకృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 3 : మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద శని వారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. వర్ధన్నపేట ఏఎస్ఐ ములసయ్య ఆధ్వర్యంలో పలు వాహనాలను నిలిపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేశారు. మద్యం సేవించి ఉన్న వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్ఐ వెంట పీసీ పిట్టల రమేష్ ఉన్నారు.